APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి   ఎడిటర్ : సి హరికృష్ణ   బుధవారం 29, జూలై 2026   సంపుటి: 01   సంచిక :62   పేజీలు : 04   వెల: 2-00/-



## రాష్ట్రపతిపై
## పుస్తకాల ఆవిష్కరణ

- రాష్ట్రపతి భవన్‌లో ఆవిష్కరణ కార్యక్రమం
- ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా తొలి ప్రతుల విడుదల
- రాష్ట్రపతి భవన్ విశిష్టతను చాటే ఐదు ప్రచురణలు
- వారసత్వంపై గర్వంతో ప్రగతి దిశగా సాగాలని రాష్ట్రపతి పిలుపు

న్యూఢిల్లీ, జూలై 28: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పదవీకాలానికి సంబంధించిన ప్రత్యేక ప్రచురణల తొలి ప్రతులను రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రాష్ట్రపతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆ ప్రచురణలను ఆయన అధికారికంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్ చరిత్ర, సంప్రదాయాలు, సేవా కార్యక్రమాలు, సమగ్ర భాగస్వామ్యం, భారతీయత విశిష్టతను ప్రతిబింబించే ఐదు ప్రచురణలను విడుదల చేశారు. వీటిలో రాష్ట్రపతి భవన్: రాష్ట్ర కా భవన్, సేవా ఔర్ సంవేదనా, సమావేషి సహభాగితా, భారతీయతా కా ఉత్సవ్, అలాగే ప్రముఖులు రచించిన వ్యాసాల ఒడియా సంకలనం 'అమ రాష్ట్రపతి - అమ గౌరవ్' ఉన్నాయి. కార్యక్రమంలో మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఈ చిత్రాలతో కూడిన ప్రచురణలు రాష్ట్రపతి భవన్ సంప్రదాయాలు, నిర్వహణ విధానం, విభిన్న కోణాలను ప్రజలకు చేరువ చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ అత్యున్నత రాజ్యాంగ సంస్థ పనితీరుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రచురణల అసలు ప్రాధాన్యం దేశ వారసత్వంపై గర్వాన్ని పెంపొందించడంతో పాటు అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు పౌరులకు స్ఫూర్తినివ్వడంలో ఉందని రాష్ట్రపతి తెలిపారు.

## ఏపీలో పెట్టుబడులపై చర్చలు

- అమరావతిలో ఆదిత్య బిర్లా ప్రతినిధితో లోకేష్ భేటీ
- తయారీ, స్వచ్ఛ ఇంధన రంగాలపై అభిప్రాయాల మార్పిడి
- రాష్ట్రంలో కొత్త పెట్టుబడుల అవకాశాలపై చర్చ
- పారిశ్రామికాభివృద్ధికి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి



అమరావతి, జూలై 28 : ఆంధ్రప్రదేశ్‌ను తయారీ, స్వచ్ఛ ఇంధనం, అధిక విలువ కలిగిన పారిశ్రామిక రంగాలకు ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆదిత్య బిర్లా గ్రూప్ ప్రతినిధి ఆర్యమన్ విక్రమ్ బిర్లాతో రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. అమరావతిలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను మరింత ఆకర్షించే అవకాశాలపై ఇద్దరూ అభిప్రాయాలు పంచుకున్నారు. తయారీ రంగం, స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టులు, అధిక విలువ కలిగిన పరిశ్రమల స్థాపన ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసే అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు వెల్లడించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో పలు రంగాల్లో బలమైన ఉనికిని ఏర్పరుచుకుందని నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆ సంస్థ పోషిస్తున్న పాత్రను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు, కొత్త ప్రాజెక్టుల ద్వారా భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అనుకూల విధానాలను అమలు చేస్తూ పెట్టుబడిదారులకు వేగవంతమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, అనుకూల వ్యాపార వాతావరణాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉందని లోకేష్ వివరించారు. ప్రపంచ స్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక, తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ--పారిశ్రామిక రంగాల భాగస్వామ్యం తో కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




## హెచ్‌ఆర్‌సీ అధికారాలపై స్పష్టత

- ప్రైవేట్ సంస్థలపై విచారణాధికారం లేదన్న హైకోర్టు
- ప్రభుత్వ ఉద్యోగుల వ్యవహారాలకే హెచ్‌ఆర్‌సీ పరిమితమని వ్యాఖ్య
- పని ప్రదేశ వేధింపులకు ప్రత్యేక చట్టాలే సరైన మార్గమని సూచన
- కంపెనీ పిటిషన్‌కు అనుకూలంగా తీర్పు

హైదరాబాద్, జూలై 28 : ప్రైవేట్ కంపెనీలు, వాటి ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులను విచారించే అధికారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు లేదని తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హెచ్‌ఆర్‌సీ అధికార పరిధి ప్రభుత్వ ఉద్యోగులు, వారి విధుల్లో నిర్లక్ష్యం లేదా ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించిన అంశాల వరకే పరిమితమని స్పష్టం చేసింది. ఈ మేరకు హెచ్‌ఆర్‌సీ జారీ చేసిన ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది. వెల్స్ ఫార్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులు పనిప్రదేశంలో వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. ఈ ఫిర్యాదులపై హెచ్‌ఆర్‌సీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సంబంధిత సంస్థ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం సంబంధిత వాదనలు పరిశీలించింది. ఉద్యోగ వివాదాలు, పనితీరు మదింపు, కార్యాలయ అంతర్గత వ్యవహారాలు యజమాని, ఉద్యోగుల మధ్య పరిష్కరించాల్సిన అంశాలని ధర్మాసనం పేర్కొంది.

## నందిగామ అభివృద్ధిపై ఢిల్లీలో చర్చలు



- జిల్లా ఇంచార్జ్ మంత్రితో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భేటీ
- నియోజకవర్గ సమస్యలు, పెండింగ్ పనులపై సమీక్ష
- అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి
- మరిన్ని నిధులు, ప్రాజెక్టుల సాధనకు కృషి

న్యూఢిల్లీ, జూలై 28: నందిగామ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. మంగళవారం ఢిల్లీలో ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఆమె సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సవివరంగా చర్చించారు. అంతకు ముందు ఎన్టీఆర్ జిల్లా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశమైన తంగిరాల సౌమ్య నందిగామ నియోజక వర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజల అవసరాలు, పెండింగ్ సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా ఇంచార్జ్ మంత్రి సత్య కుమార్ యాదవ్‌తో జరిగిన సమావేశంలో నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు, పూర్తి కావాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ సహకారం అవసరమైన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ప్రజలు సూచించిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తంగిరాల సౌమ్య తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల సమన్వయంతో నందిగామను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నియోజక వర్గానికి మరిన్ని నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు తీసుకురావడానికి ఎంపీ, జిల్లా పార్టీ నాయకత్వం, మంత్రులు, ప్రజా ప్రతి నిధులతో సమన్వయం కొనసాగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలోనూ నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.



## డీఎస్సీపై రోజా తీవ్ర ఆరోపణలు

- తిరుపతిలో వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- డీఎస్సీ నియామకాలపై విచారణ జరపాలని డిమాండ్
- లోకేశ్ రాజీనామా చేయాలని మాజీ మంత్రి డిమాండ్
- విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శ

తిరుపతి, జూలై 28: డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల నిర్వహణలో భారీగా అక్రమాలు, కుంభకోణం జరిగాయని ఆరోపిస్తూ మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రోజా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రెండో గేటు వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. దీనిని "మెగా డీఎస్సీ" కాకుండా "దగా డీఎస్సీ"గా మార్చిందని విమర్శించారు. జీవో 420 జారీ చేసి అర్హత లేని సుమారు 427 మందికి అక్రమంగా ఉద్యోగాలు కల్పించారని, పరీక్షల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని రోజా డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. లోకేశ్ పదవి నుంచి తప్పుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.7 వేల కోట్ల బకాయిలు విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని రోజా ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని కూడా విమర్శించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి అనుకూల ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తోందని రోజా ఆరోపించారు. మహిళల భద్రత, నిరుద్యోగుల భవిష్యత్తు, విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శిస్తూ, బాధితులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

అనంత సూర్య



# మెగా డీఎస్సీపై సీబీఐ విచారణ జరపాలి - మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్





- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్
- పుట్టపర్తిలో వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

పుట్టపర్తి, జూలై 28 అనంత సూర్య: మెగా డీఎస్సీ-2025 నియామకాలలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై స్వతంత్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐతో విచారణ జరిపించాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మెగా డీఎస్సీ పేరుతో చేపట్టిన టీచర్ల నియామకాల్లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించిన ఆమె, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా కింద 421 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో రాత పరీక్ష లేకుండా క్రీడా సర్టిఫికెట్ల ఆధారంగా ఎంపికలు జరపడం, అర్హత ప్రమాణాలను సడలించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై తమ పార్టీ ఆధారాలతో ప్రశ్నించినప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా ఎదురుదాడికి దిగుతోందన్నారు. నిజంగా ఎలాంటి అక్రమాలు జరగకపోతే సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. డీఎస్సీ-2025 ద్వారా సుమారు 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరుగుతుండగా, దాదాపు 3.5 లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ ప్రక్రియలో ఒక్క అక్రమం జరిగినా మొత్తం విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (పీటీఎం)లో చేసిన ప్రచారానికి, యూడైస్ గణాంకాలకు పొంతన లేదని ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, అదే సమయంలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని గణాంకాలను ఉటంకిస్తూ ప్రభుత్వ విద్యపై ప్రజల నమ్మకం దెబ్బతింటోందని విమర్శించారు. 'తల్లికి వందనం' పథకం అమలులోనూ ప్రభుత్వం విద్యార్థులను, వారి తల్లులను నిరాశపరిచిందని ఆరోపించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులను పథకం పరిధి నుంచి తప్పించారని, ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 'నాడు--నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని, ప్రస్తుతం ఆ కార్యక్రమం నిలిచిపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ సమస్యల్లో కూరుకుపోయాయని విమర్శించారు. అనేక పాఠశాలల్లో తాగునీటి సమస్యలు, పుస్తకాల పంపిణీలో జాప్యం, విద్యాకానుక అమలులో ఆలస్యం, వసతి దీవెన నిలిచిపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు పుస్తకాలు, విద్యాకానుక, పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన అమలు చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలహీనపరిచి పేద విద్యార్థులను కార్పొరేట్ విద్యాసంస్థల వైపు నెట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. విద్య వ్యాపారం కాదని, ప్రతి చిన్నారి హక్కని, ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించడం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె స్పష్టం చేశారు.

# కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి: సీఐటీయూ



కదిరి, జూలై 28 అనంత సూర్య: కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు, స్కీమ్ వర్కర్లను శాశ్వతీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30, 31 తేదీల్లో పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కదిరిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి అంబేద్కర్ సర్కిల్, జీవిమాన్ సర్కిల్, ఇక్బాల్ రోడ్డు, కోనేరు సర్కిల్, హిందూపూర్ సర్కిల్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అన్ని రంగాల కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనాల బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లుగా కార్మికుల వేతనాలు పెంచలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబ్ జాన్, సాంబశివ, ముస్తాక్, జగన్, రామ్మోహన్, శివప్రసాద్, సుధాకర్ రెడ్డి, బాలకృష్ణ, తిరుపాల్, జనార్ధన్, కృష్ణా నాయక్, నారాయణ, రమేష్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం చేసిన పాపాలు ప్రజల్ని వెంటాడుతున్నాయి






అనంతపురం, జూలై 28 అనంత సూర్య : గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు నేటికీ ప్రజలను వెంటాడుతున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి మండలం దాదులూరు పంచాయతీలో కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే సునీతకు స్థానిక నాయకులు, గ్రామస్తులు, తల్లికి వందనం పథకం వర్తించిన విద్యార్థిని విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పల్లికి వందనం పథకం మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు చిన్నారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ తర్వాత స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్తూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కనగానపల్లి మండలంతో పాటు దాదులూరు పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి చేశారన్నది వివరించారు. మరోవైపు చదువుకునే పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లోనూ తల్లికి వందనం పథకం గురించి ఆరా తీశారు. మీకు పథకం వచ్చిందా.. ఎంతమంది పిల్లలు ఉన్నారు.. ఎంతమందికి వచ్చిందన్నది ఎమ్మెల్యే సునీత తెలుసుకున్నారు. ఈ పథకంపై మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తల్లికి వందనం వర్తింపజేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే సునీతకు చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో రామస్వామి దేవాలయం అభివృద్ధికి నిధులు కేటాయించమని గ్రామస్తులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే సునీత సానుకూలంగా స్పందించారు. అయితే గ్రామంలో ఎక్కువ మంది తమకు గత ప్రభుత్వాలలో ఇల్లు కేటాయించినప్పటికీ సాంకేతిక సమస్యల కారణంగా అవి నేటికీ రాలేదన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వివిధ రకాల సమస్యలను ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకురాగా.. వెంటనే హౌసింగ్ అధికారులతో మాట్లాడారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను వారు వివరించారు. వెంటనే వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. అవసరమైతే హౌసింగ్ ఎండి, మంత్రి వద్దకు కూడా ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు కారణంగా ప్రజలు నేటికీ ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని.. ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు వాటన్నింటినీ సరిచేస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎప్పుడు లేని విధంగా రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి గ్రామంలోనూ మేము చేసిన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రతి ఇంటిలోనూ తమకు సంక్షేమ పథకాలు అందాయన్న సంతృప్తి కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ తాము ఈ కార్యక్రమాన్ని చేస్తున్నట్లు ఎమ్మెల్యే సునీత వివరించారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామానికి చెందిన బోయ కేశన్న అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

# వైయస్ జగన్ కలిసిన సుఖేష్



అనంతపురం, జూలై 28 అనంత సూర్య : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని అనంతపురం 16 వ డివిజన్ వైసీపీ కన్వీనర్ సుఖేష్ (డిష్ బాషా) మంగళవారం తాడేపల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

# క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

- హోంగార్డ్స్ ప్రజా దర్బార్‌లో ఎస్పీ సూచనలు




పుట్టపర్తి, జూలై 28 అనంత సూర్య: ప్రతి హోంగార్డు క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ సూచించారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో మంగళవారం నిర్వహించిన హోంగార్డ్స్ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని హోంగార్డులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విధుల నిర్వహణతో పాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా సేవలు అందించగలరని అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. హోంగార్డులు ప్రజలకు మరింత చేరువై సేవాభావంతో విధులు నిర్వహించాలని, విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో హోంగార్డ్ కమాండెంట్ హనుమంతప్ప, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డ్ డీఎస్పీ హరికృష్ణ, ఆర్ఐ వలి, ఆర్ఎస్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.



# విప్లవం విజయవంతమై తీరుతుంది




అనంతపురం, జూలై 28, అనంత సూర్య : కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి సభ ఈరోజు ఉదయం అనంతపురం పట్టణంలోని ఎన్జీవో హోంలో పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది ప్రధాన ప్రసంగం చేసిన సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్ బాబు ప్రసంగిస్తూ కామ్రేడ్ టిఎన్ 1969లో అసెంబ్లీకి రాజీనామా చేశాక ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై కుట్ర కేసు బనాయించిందన్నారు. ఆ కేసు విచారణ సందర్భంగా ప్రభుత్వం ఆయనపై మోపిన దేశద్రోహ నేరారోపణను తిప్పికొడుతూ భారత పాలకవర్గాలే బ్రిటిష్ వాళ్ళతో కుమ్మక్కై భారత ప్రజలకు ద్రోహం చేసినట్లు ఆయన రుజువు చేశారన్నారు. ఫలితంగానే ప్రజల్ని విప్లవించమని ఆయన పిలుపునిస్తూ విప్లవ విజయం తథ్యం అని నొక్కి వక్కాణించారు. 10వేల కోట్లు అప్పు ఉన్నప్పుడే ఆయన తాకట్టులో భారతదేశం అన్నాడని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అప్పు 250 లక్షల కోట్లకు చేరిందని, రాష్ట్రాల అప్పు మరో 250 లక్షలకోట్లు వెరసి ప్రతి భారతీయునిపై ప్రభుత్వాలు చేసిన తలసరి అప్పు సుమారు 3 లక్షల రూపాయలకు చేరిందని దేశంలో నెలకొన్న ఆర్థిక రాజకీయ సామాజిక సంక్షోభమే ప్రజల్ని విప్లవం వైపు నడుపుతుందన్నారు. ఇటీవలి విద్యార్థుల ఆందోళన విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభ ఫలితమైనన్నారు. సభలో జన సాహితి నాయకులు డాక్టర్ బి.సూర్య సాగర్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం భాష, రక్త దాన ఉద్యమ నేత తరిమెల అమర్నాథ్ రెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గజ్జల దస్తగిరి, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి సి.మల్లేశ్వరి, నవయువ సమాఖ్య జిల్లా నాయకులు కె.మల్లేశ్వరిలు ప్రసంగించారు. కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు. సభకు ముందు రైతు కూలీలు పట్టణ పేదలు ప్రదర్శనగా వెళ్లి తరిమెల నాగిరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతపురం సభ ముగిసిన తర్వాత కార్యకర్తలు ఆయన సొంత గ్రామమైన తరిమెలలో నిర్మించిన తరిమెల నాగిరెడ్డి స్థూపం వద్ద నివాళి తెలిపి ఆయన బాటలో నడుస్తామని ప్రతినబూనారు.

# మెగా డీఎస్సీపై.. బహిరంగ చర్చకు సిద్ధమా!



- వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి సవాల్
- వైసీపీ నిరసనలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన దగ్గుపాటి
- మీ హయాంలో ఒక్క టీచర్ పోస్ట్ అయినా భర్తీ చేశారా..?
- ఆరోపణలు నిరూపిస్తారా.. కేసులు ఎదుర్కొంటారో.. తేల్చుకోవాలని సూచన


***అనంతపురం, జులై28 అనంత సూర్య :***

మెగా డీఎస్సీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సవాల్ విసిరారు. అనంతపురంలో మంగళవారం రోజు మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాల మీద ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేవలం 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ పూర్తి చేశారని, 16347 పోస్టులు భర్తీ చేశారని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి రికార్డు టైంలో దీనిని పూర్తి చేశామన్నారు. అయితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేని వైసీపీ ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తాము ఇంటింటికి వెళ్లి వివరిస్తుంటే.. ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ప్రజలను స్పందనను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే విమర్శలు చేశారు. మెగా డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారని.. అయితే ఇప్పటివరకు వైసీపీ నాయకులు చర్చకు రాకుండా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు చేతనైతే ఆరోపణలు నిరూపించాలని, లేకపోతే కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఇప్పటివరకు నాలుగు మెగా డీఎస్సీలు నిర్వహించారని, ఒక్కచోట కూడా అవినీతి ఆరోపణ లేకుండా పూర్తి చేశారన్నారు. అదే బాటలోని మంత్రి నారా లోకేష్ కూడా అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించారని దగ్గుపాటి అన్నారు. డీఎస్సీని ఆపటానికి 238 కేసులు వైసీపీ నాయకులు వేసినప్పటికీ వాటిని సమర్ధవంతంగా మంత్రి నారా లోకేష్ ఎదుర్కొన్నారన్నారు.

పేపర్ లీకేజీ అయిందని స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఇలా ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాటిలో ఏ ఒక్క దానికి కూడా వైసిపి నాయకుల వద్ద ఆధారాలు లేవన్నారు. అలాంటి ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని దగ్గుబాటి సూచించారు. వైసిపి హయాంలో గ్రూప్ 2 పోస్టులు భర్తీ చేస్తే అందులో 150 మంది నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైయస్ హయాంలో డీఎస్సీ నిర్వహిస్తే ఆరోజు కాంగ్రెస్ నేతల పిల్లలకి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వైసిపి హయాంలో జరిగిన సచివాలయ ఉద్యోగాల నియామకాల్లో కూడా అనేక అక్రమాలు జరిగాయన్నారు. కనీసం ఐదేళ్లలో ఒక ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదని.. ప్రైవేట్ కంపెనీలు రాలేదు ఉద్యో గాలు ఉద్యోగాలు రాలేదని అన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషితో 25 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రత్యేకించి విద్యాశాఖలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఆరోజు ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద, టాయిలెట్ల వద్ద నిలబెట్టి అవమానించారన్నారు. ఈరోజు అదే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పించిన నాయకుడు మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థులు చేరుతున్నారన్నారు. ఒక్క అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే 4 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ఫ్యాక్షన్ నేపథ్యంతో వచ్చిన గొడ్డలి పార్టీ నాయకులు నిత్యం ఏదో ఒక వివాదం సృష్టించాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తన సొంత బాబాయిని హత్య చేసిన వారి మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. గత ఎన్నికల్లో వారిని 11 స్థానాలకు పరిమితం చేశారని వచ్చే ఎన్నికల్లో అవి కూడా రావన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని.. లేకపోతే కేసులు ఎదుర్కోక తప్పదని ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరించారు.

## దగా డీఎస్సీపై 'అనంత' పోరుబాట

అనంతపురం, జులై 28 అనంత సూర్య : రాష్ట్రంలో దగాపడ్డ డీఎస్సీ అభ్యర్థులకు అండగా వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టింది. సోమవారం అనంతపురంలో వైఎసఆర్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదురుగా ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహం వద్ద నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి మానహారం చేపట్టారు. ర్యాలీలో వైఎసఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ప్రజాప్రతినిధులు, వైసీపీ, అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు పాల్గొని కదం తొక్కారు. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నినదించారు. నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులు, యువత గళం విప్పాయి. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి, యువజనుల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలం అయ్యాయని మండిపడ్డారు. నీట్ పరీక్ష లీకేజీపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగితే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారన్నారు. ఈ రాష్ట్రంలో డీఎస్సీ నియమకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవినీతి జరిగిందని విమర్శించారు. పరీక్షలు నిర్వహించే విభాగంలోని ఉద్యోగులే డీఎస్సీలో ఎంపికయ్యారన్నారు. నారా లోకేష్ రాజీనామా చేయకపోతే యువత, విద్యార్థులు తమ సత్తా ఏంటో చూపిస్తారని తెలిపారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమని నారా లోకేష్ చెబుతున్నారని.. వైఎసఆర్‌సీపీ కూడా చర్చకు సిద్ధమని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9 వేల కోట్లు ఉన్నాయని.. విద్యార్థులు సర్టిఫికెట్లు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండేళ్లు గడిచినా నిరుద్యోగ భృతి ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వమిదని మండిపడ్డారు. నారా లోకేష్ రాజీనామా చేయకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒకే నోటిఫికేషన్‌తో 1.35 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినా ఎక్కడా చిన్న ఆరోపణ కూడా రాలేదన్నారు. రోస్టర్, మెరిట్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి సంతకం చేసిన డీఎస్సీని అక్రమాల పుట్టగా మార్చేశారని విమర్శించారు. డబ్బులిస్తే చాలు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే పరిస్థితికి తెచ్చారన్నారు. కష్టపడి చదివితే ఉద్యోగం వస్తుందని యువత భావిస్తే కనీసం మెరిట్



లిస్ట్ కూడా ప్రకటించకుండా పోస్టులను అమ్ముకున్నారని ఆరోపించారు. డీఎస్సీలో ఎలా అవినీతి, అక్రమాలు జరిగాయో వైఎస్ జగన్ ప్రెస్‌మీట్ పెట్టి వివరించినా ఈ ప్రభుత్వం, నారా లోకేష్ సమాధానం ఇవ్వలేదన్నారు. నిజంగా అక్రమాలు జరగలేదని భావిస్తే తక్షణం సీబీఐ విచారణ చేయించేందుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. వైఎస్ జగన్ అమ్మ ఒడి పథకాన్ని రూపొందిస్తే దాన్ని తల్లికి వందనంగా మార్చి అర్హులకు కూడా ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. రెండేళ్లుగా నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఒక్కో నిరుద్యోగికి ఈ ప్రభుత్వం రూ.75 వేలు బాకీ పడిందన్నారు. నారా లోకేష్ రాజీనామా చేయకపోతే యువత సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. ఫీజురీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని, తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు

## గుండెపోటుతో శ్రీ సత్యసాయి నీటి సరఫరా పథకం కార్మికుడు మృతి




**కార్మిక ఉద్యమానికి తీరని లోటు: సంఘం నాయకులు**

కొత్తచెరువు, జూలై 28 అనంత సూర్య: శ్రీ సత్యసాయి నీటి సరఫరా పథకంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న కోట్ల రాము (55) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. కొత్తచెరువు మండలం నారాయణపురం క్రాస్ సమీపంలో గ్రామీణ నీటి ట్యాంకుకు పైప్‌లైన్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో అస్వస్థతకు గురైన రాముకు ఛాతినొప్పి రావడంతో సహచర కార్మికులు వెంటనే పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. కోట్ల రాము శ్రీ సత్యసాయి నీటి సరఫరా కార్మిక సంఘం జిల్లా కోశాధికారిగా సుదీర్ఘకాలంగా పనిచేస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సేవలందించారు. మంగళవారం బసంపల్లి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, కోట్ల రాము మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని, ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి.

పుట్టపర్తి/కొత్తచెరువు, జులై 28, అనంత సూర్య: వాతావరణ పరిస్థితులకనుగుణంగా పంటలను సాగు చేయాలని పుట్టపర్తి మండల వ్యవసాయ అధికారి శ్రీ వాణి రైతులకు సూచించారు.



పుట్టపర్తి మండల పరిధిలోని బీడుపల్లి , బడే నాయక్ తాండ గ్రామ పరిధిలో మండల వ్యవసాయాధికారిణి శ్రీవాణి ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయాధికారిణి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు చేసే పంటలు మార్పులు చేసుకుంటే ఎల్లి నో ప్రభావాన్ని ఎదుర్కోవచ్చానని రైతులకు సూచించారు. వర్ష బావ పరిస్థితులను తట్టుకునే పంటలపై రైతుల దృష్టి పెట్టాలని తక్కువ నీటితో సాగు చేయగలిగే ఆముదం అలసంద జొన్నలు ఉలవలు , కంది లాంటి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. సాంకేతిక సలహాలు పాటిస్తూ ఆధునిక పద్ధతులతో పాటు సేంద్రీయ సాగుకు ప్రధానిత్య ఇవ్వాలని కోరారు. సేంద్రీ వ్యవసాయం అవలంబించడం ద్వారా నేల సారవంతం తో పాటు పంటల నాణ్యతను కూడా పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. ఖరీఫ్ లో సాగు చేసిన ప్రతి పంటను సంబంధించిన రైతు సేవ కేంద్ర సిబ్బందితో పంట నమోదు కార్యక్రమం చేయించుకోవాలని రైతులకు సూచించడం జరిగినది దీనివలన ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం రైతులకు అందించడంలో ఎంతో ఉపయోగపడుతుంది కావున ప్రతి రైతు కచ్చితంగా ఈ పంట నమోదు కార్యక్రమం చేయించుకోవాలని రైతులకు సూచించారు. వాతావరణ బీమా ఈనెల ఆఖరి 31.వ తేదీ వరకు ఒక ఎకరా వేరుశనగ 640 రూపాయలు బత్తాయి,2750, దానిమ్మ 3750, టమోటా 1600 రూపాయలు ఈ పంట సాగు చేసిన రైతులు కామన్ సర్వీస్ సెంటర్ నందు రైతులు ప్రీమియం చెల్లించాలని, పసల్ బీమా యోజన పథకం కింద ఒక ఎకరాకు కంది 102 రూపాయలు మొక్కజొన్న 165, రాగి 100, ఆముదం 100, వరి 200 రూపాయలు చొప్పున రైతుల కామన్ సర్వీస్ సెంటర్ లో రైతులు ప్రీమియం చెల్లించవలయు నని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ శ్రీకాకుళం ఆఫీసర్ వేణుగోపాల్ నాయక్, రైతులు , రైతు సేవ కేంద్రం సిబ్బంది చంపక లక్ష్మి, గంగరాజు, ముబీనా పాల్గొన్నారు.

## కొండకుమార్లలో సివిల్ రైట్స్ డే నిర్వహణ

**ఎస్సీ వర్గాల అభ్యున్నతికి విద్య, హక్కులపై అవగాహన కల్పింపు**

ఓడీసి మండలం, జూలై 28 అనంత సూర్య: ఓడీసి మండలం కొండకుమార్ల గ్రామంలో మంగళవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యుడు సోదినపల్లి రామాంజనేయులు పాల్గొని ఎస్సీ వర్గాల అభ్యున్నతి, విద్య, సామాజిక హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గాల కుటుంబాలు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, క్రమశిక్షణతో పెంచాలని సూచించారు. గ్రామాల్లో వివక్ష, అంటరానితనానికి తావులేకుండా సామరస్య వాతావరణాన్ని నెలకొల్పాలని పిలుపునిచ్చారు. సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించేందుకు విద్య, అవగాహన, ఐక్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామంలో శ్మశాన వాటిక, తాగునీరు, మౌలిక వసతులు, సైడ్ కాలువలు, ఎస్సీ రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాల మంజూరు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, నిజంగా వివక్ష లేదా హక్కుల ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో మాత్రమే చట్టాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఆర్ఐ, వీఆర్వో, ఎంపీడీవో, పోలీసు అధికారులు, వీఆర్ఏ, అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.





# ప్రతి ఇంటి ముందు చెట్టు కనిపించాలి

- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన
- ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా 2కే రన్
- నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- ఎల్-నినో వంటి పరిస్థితుల్ని ఎదుర్కొవాలంటే మొక్కలు పెంచడమే ఏకైక మార్గం
- యువత బాధ్యతగా తీసుకోవాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

*అనంతపురం, జులై 28 అనంత సూర్య :*

ఎల్-నినో వంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవాలంటే చెట్లు నాటడమే ఏకైక మార్గమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అనంతపురం నగరంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ అనంతపురం చైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూటమి నాయకులు, వందలాది మంది విద్యార్థులు, నగరవాసులు పాల్గొన్నారు. టవర్ క్లాక్ వద్ద వ్యాయామం, డ్యాన్సులతో యువత ఆకట్టుకుంది. మొక్కలు పెంచేలా అవగాహన కల్పిస్తూ నిర్వహించిన 2కే రన్ ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఎల్-నినో వంటి వాతావరణ పరిస్థితులతో వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇలాంటి వాటిని ఎదుర్కోవాలంటే మొక్కలు పెంచడమే ఏకైక మార్గమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రతి ఇంటి ముందు చెట్టు ఉండాలి.. ప్రతి సంస్థ వద్ద చెట్లు కనిపించాలన్నారు. విద్యార్థులు, యువత దీనిపై



అవగాహన కల్పించాలని సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కోసం ప్రతి 3వ శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి వాటి మీద నిర్లక్ష్యం వహించడంతో పాటు లక్షల టన్నుల చెత్త పెట్టి పోయారన్నారు. ఆ చెత్త నుంచి ఇప్పుడు సంపద సృష్టించేలా ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు లలిత్ కుమార్, సంధి రెడ్డి శ్రీనివాసులు, అనంతలక్ష్మి కళాశాల చైర్మన్ అనంత రాముడు, అటవీశాఖ అధికారులు ఎస్వి డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే పనుల వేగవంతానికి మండలాలకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



**♦ డిసెంబర్ 31, 2026 నాటికి రీ-సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

పుట్టపర్తి, జూలై 28 అనంత సూర్య: జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు డీఎస్ఎస్ఎల్ఆర్ కార్యాలయం నుంచి మంజూరైన ల్యాప్‌టాప్‌లను అన్ని మండలాలకు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కలిసి మండల సర్వేయర్లకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ల్యాప్‌టాప్‌లను రీ-సర్వే సంబంధిత అధికారిక పనులకు మాత్రమే వినియోగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ నిర్వహించే రీ-సర్వే వివరాలకు సంబంధించిన వెక్టరైజేషన్ ప్రక్రియను అదే రోజున పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా రీ-సర్వే పనులను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా రీ-సర్వే సహాయ సంచాలకురాలు విజయశాంతి, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీవై పార్టీ విద్యార్థి విభాగం ఎస్కేయూ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం, జులై 28 అనంత సూర్య : బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎస్కేయూనివర్సిటీలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఎస్కే యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని అనంతరం బీసీవై పార్టీ విద్యార్థి విభాగం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ ఎన్నికల్లో ఎస్కే యూనివర్సిటీ కన్వీనర్‌గా మంజునాథ్, కో కన్వీనర్‌గా అర్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఎస్కే యూనివర్సిటీలో విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు.



యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వారు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా యూనివర్సిటీలో ఉన్న వసతి గృహాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే విద్యార్థులు ఉంటున్న వసతి గృహాలను మరమ్మతులు చేసి యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూతనంగా యూనివర్సిటీ కన్వీనర్, కో కన్వీనర్‌గా ఎన్నికైన బీసీవై పార్టీ విద్యార్థి విభాగం నాయకులు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై పోరాడుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ విద్యార్థి విభాగం నాయకులు యోగేష్, బాలు, మహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


# రెండేళ్లలో రూ.1262కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు



అనంతపురం, జులై 28 అనంత సూర్య : రెండేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రూ.1262 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామని.. ఇది మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ కాలనీలో ఉన్న భగత్ సింగ్ నగర్ లో ఆయన ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు కాలనీవాసులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రెండేళ్లలో చేసిన వాటి గురించి కరపత్రాలను అందజేశారు. అలాగే సంక్షేమ పథకాలు అందుతున్నాయా కాలనీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీస్తూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే పర్యటనకు మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని సంర్వనాశనం చేసిందన్నారు. రెండేళ్లలో సంక్షేమ, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. 75 ఏళ్ల వయసులో 25 ఏళ్ల యువకుడిలా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికే 25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని... 25 లక్షల ఉద్యోగాల కల్పిస్తున్నారన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ వలనే జరుగుతోందన్నారు. గతంలో జగన్ రెడ్డి అమరావతితో మూడు ముక్కలాట ఆడితే.. భవిష్యత్‌లో రాజధానిని ఎవరు కదిలించకూడదనే ఉద్దేశంతో చట్టబద్ధత కల్పించారన్నారు. అమరావతిలో భవనాల నిర్మాణం వేగంగా సాగుతోందని... ప్రపంచంలోనే నెంబర్-1 సిటీగా మారుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు 2014-19 కాలంలో దాదాపుగా పూర్తి చేశారని... అయితే గత ఐదేళ్లలో కనీసం గంపెడు మట్టి కూడా వేయని కారణంగా పోలవరం ఆగిపోయిందన్నారు. 2027లో పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తారన్నారు. గతంలో జగన్ రెడ్డి ఎక్కడికి వెళ్లాలన్న పరదాలు కట్టుకుని వెళ్లే వారని... ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ హంగు, ఆర్భాటం లేకుండా ప్రజల్లోనే ఉంటూ పర్యటనలు సాగిస్తున్నారని అన్నారు. రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని.. ఒక్క అనంతపురం జిల్లాలోని లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చినట్లు చెప్పారు. దేశం గర్వించే విధంగా యుద్ధ విమానాలు పుట్టపర్తి ప్రాంతంలో తయారవుతున్నాయన్నారు. మరోవైపు పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా, ఆటో డ్రైవర్ల సేవలో వంటి అనేక పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చిన మార్పుల కారణంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. ఈ ఏడాది లక్షా 10వేల మంది ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారన్నారు. ఎమ్మెల్యేలు చేత సిఫార్సులు చేయించుకునే పరిస్థితిలో ఈరోజు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. 67 లక్షల మందికి పైగా 10వేల 120 కోట్ల మీద తల్లికి వందనం అమలు చేస్తున్నారన్నారు. అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువను 1800 క్యూసెక్కుల నుంచి 3800 క్యూసెక్కులకు పెంచారన్నారు. 3500 కోట్ల రూపాయల ఖర్చు చేసి.. ఇటు కుప్పం, అటు మడకశిర వరకు నీరు తీసుకెళ్తున్నారన్నారు. రెండేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కేవలం మౌళిక వసతుల కోసం 200 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. 7కోట్ల రూపాయల వరకు సీఎంఆరఆఫ్ కింద సాయం చేసినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో కనీసం కోటి రూపాయలు కూడా ఇవ్వలేదని విమర్శలు చేశారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజు, యూనిట్ ఇంచార్జ్ హరి కుమార్, టిడిపి నాయకులు లింగమయ్య స్వామి, చౌడయ్య, బిజెపి జిల్లా నాయకుడు అశోక్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొనకొండ్ల వెంకటేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, టిడిపి నాయకులు సింగవరం రవి, నెట్టెం బాలకృష్ణ, శోభ, డిష్ గోపాల్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఎఫ్ అడహక్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

అనంతపురం, జులై 28 అనంత సూర్య : ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ (ఆర్టీఎఫ్-ఏపీ) అనంతపురం జిల్లా ప్రాంతీయ సమావేశం మంగళవారం అనంతపురం ఉపాధ్యాయ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం.నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఐఫియా చీఫ్ ప్యాట్రన్ శ్రీ సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు, రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ చంగల్‌రాయ మందాడి, ఆర్టిఎఫ్ నంద్యాల జిల్లా ప్రతినిధి అబ్దుల్ వహీద్, చిత్తూరు జిల్లా ప్రతినిధి మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు జి.రవీంద్ర, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ నాయక్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెన్షన్, వైద్య సదుపాయాలు, పెండింగ్ బకాయిలు వంటి ముఖ్య సమస్యల పరిష్కారం కోసం రిటైర్డ్ ఉపాధ్యాయులు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీఆర్టీఎఫ్‌ను బలోపేతం చేసి, రిటైర్డ్ ఉపాధ్యాయుల హక్కుల




సాధనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా జోసెఫ్, జిల్లా కో-కన్వీనర్‌గా ఎం.నరసింహులు, సభ్యులుగా రామాంజనేయులు, వివి.సుబ్బారెడ్డి, రామకృష్ణ, సదాశివ, సాయిబాబా, సూర్యనారాయణ, విశ్వనాథ్ ఉన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సమావేశంలో పాల్గొన్న నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు అభినందించి, జిల్లా వ్యాప్తంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసి, రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, ఆదినారాయణ, నాగేంద్ర రెడ్డి, ఫణీంద్రనాథ్ రావుతో పాటు జిల్లాలోని పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పీవీకేకే విద్యార్థులకు మోల్డ్ టెక్ టెక్నాలజీస్‌లో ఉద్యోగాలు

అనంతపురం, జులై 28 అనంత సూర్య : స్థానిక రుద్రంపేట పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మంగళవారం ప్రముఖ సంస్థ మోల్డ్-టెక్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు మాట్లాడుతూ.. పీవీకేకే ఐటీ బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కొరకు ఈ ప్రాంగణ నియామకాలు నిర్వహించామని, ఎంపికైన విద్యార్థులు ట్రైనీ [illegible]ణ ఇంజనీర్ హోదాలో నియమితులవుతారని. వీరికి వార్షిక వేతనం



రూ.3.5లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్లేస్మెంట్స్ డీన్ డాక్టర్ భానుకిరణ్ మాట్లాడుతూ.. ఈ నియామక ప్రక్రియలో భాగంగా అప్టిట్యూడ్, రీజనింగ్, సంబంధిత సబ్జెక్ట్ పరీక్ష, సర్టిఫికేషన్ పరీక్ష, టెక్నికల్ హెచఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ కిషోర్ పల్లె, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ.. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ హెచ్ ఆర్ మేనేజర్ సురేష్, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వహీదా, సివిల్ విభాగాధిపతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405